# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశాభివృద్ధి ప్రయాణంలో యువత సాంకేతికంగా ముందడుగు వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు నిచ్చారు.**

**2. రాష్ట్ర పునర్నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు కోరారు.**

**3. స్వామీ వివేకానంద జయంతి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయి.**

**4. తిరుపతి పర్యటనలో భాగంగా ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహ వినియోగదారులకు సహజ వాయువు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.**

**5. ప్రపంచంలోనే పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం "మహా కుంభ మేళా" రేపు ప్రయాగ రాజ్‌లో ప్రారంభమవుతుంది.**

**6. ప్రముఖ వైద్య శాస్త్రవేత్త ఎల్లాప్రగడ సుబ్బారావు జయంతి ఈ రోజు.**

==========================

జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమం డిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత మండపంలో ఏర్పాటు చేసిన "వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్" ఎగ్జిబిషన్ ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందర్శించారు. దేశం నలుమూలల నుండి ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న మూడు వేలమంది చైతన్యం కలిగిన యువత రూపొందించిన నైపుణ్య వస్తువులను ప్రధానమంత్రి తిలకించి .... వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

"వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్" పై కేంద్ర యువజన వ్యవహారాలు ..., క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్స్ రాసిన పుస్తకంపై నరేంద్రమోదీ స్పందిస్తూ.... వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ అన్నది దేశాభివృద్ధి ప్రయాణంలో దేశ యువతను భాగస్వామ్యం చేయడానికి ఒక ప్రత్యేకమైన చొరవ అని అన్నారు. ఈకార్యక్రమం యువ మనసులలోని శక్తి, సృజనాత్మకతను వెలికి తీస్తుందని నరేంద్రమోదీ అన్నారు.

--------------------------

రాష్ట్ర పునర్నిర్మాణం ..., పేదరిక నిర్మూలనలో యువత భాగస్వాములు కావాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా యువతకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ .... వచ్చే అయిదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంతో కార్యక్రమాలు

చేపడుతున్నామని ..., దేశంలో తొలిసారిగా నైపుణ్య గణన చేపడుతున్నామని చంద్రబాబు నాయుదు పేర్కొన్నారు.

---------------------------

ఆధ్యాత్మిక గురువు స్వామీ వివేకానంద జయంతి ఉత్సవాలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. అన్ని నగరాలు ..., పట్టణాలలో స్థానిక నాయకులు ..., అధికారులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివేకానంద ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. చిత్తూరు లో జరిగిన కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు ..., తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో టి.టి.డి. పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొని వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

---------------------------

భారత దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్న కృత నిశ్చయానికి అయోధ్య రామాలయం గొప్ప ప్రేరణగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. అయోధ్య రామ మందిరం తొలి వార్షికోత్సవాలను పురస్కరించుకుని దేశ ప్రజలకు ఎక్స్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. శతాబ్దాల త్యాగం..., తపస్సు తరువాత నిర్మించిన ఈ ఆలయం మన సంస్కృతికి గొప్ప వారసత్వమని ప్రధాన మంత్రి అన్నారు.

కాగా .... అయోధ్య రామ మందిరం తొలి వార్షికోత్సవాలు నిన్న ఘనంగా ప్రారంభమయ్యాయి. గత ఏడాది జనవరి 22వ తేదీన అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహం ప్రాణ ప్రతిష్ట జరిగింది. అయితే... ఈ ఏడాది శుక్ల పక్ష ద్వాదశి ముందుగానే జనవరి 11 న వచ్చింది. దీనిప్రకారం ...రామాలయ తొలి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తిరుపతిలో పర్యటించనున్నారు. ఈ మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే ఆయన తిరుచానూరు పట్టణంలో గృహాలకు సహజ వాయువును అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంపై తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వేంకటేశ్వర్ మరిన్ని వివరాలు తెలియజేస్తూ ....

..వాయిస్.... 37 సెకన్లు

---------------------------

రాష్టంలో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఏఎస్ పేట మండలం జమ్మవరం గ్రామంలో నిన్న సాయంత్రం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో 10 కోట్లతో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి నెలలో మరో 10 కోట్ల రూపాయల నాబార్డ్ నిధులతో గ్రామాల్లో తారు రోడ్లు నిర్మిస్తామన్నారు. గ్రామాల్లో పశు సంపదను పెంచేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పశుశాలలను నిర్మిస్తామన్నారు.

---------------------------

ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం "మహా కుంభ మేళా" ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ రాజ్ నగరంలో రేపటి నుండి ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి ప్రజలు ...., సాధువులు ..., సాధ్వీలు భారీ సంఖ్యలో పాల్గొంటున్నారు. రేపు పుష్య పౌర్ణమి స్నానంతో ప్రారంభమయ్యే మహా కుంభ మేళా క్రతువు ఫిబ్రవరి 26వ తేదీన మహా శివరాత్రి స్నానంతో ముగుస్తుంది. మొత్తం 45 రోజుల పాటు జరిగే ఈ కుంభ మేళా సమయంలో గంగా..., యమునా ..., సరస్వతీ నదుల త్రివేణి సంగమం వద్ద స్నానాల కోసం ఏర్పాట్లు చేశారు. కుంభ మేళా కోసం కేంద్ర ప్రభుత్వం ..., ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాయి.

మరొక వైపు ...కుంభ మేళాకు తరలి వచ్చే భక్తుల కోసం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ళను నడుపుతోంది.

--------------------------

స్వామి వివేకానంద బోధనల నుంచి యువత స్ఫూర్తి పొందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లాలో యువజనోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమన్నారు. యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొంటూ...

..వాయిస్.. 30 సెకన్లు

--------------------------

ప్రముఖ వైద్య శాస్త్రవేత్త ఎల్లా ప్రగడ సుబ్బారావు జయంతి ఈ రోజు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణంలో 1895 జనవరి 12 వ తేదీన జన్మించిన ఆయన విద్యాభ్యాస సమయంలోనే మహాత్మ గాంధీ పిలుపుతో విదేశీ వస్త్ర బహిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1923వ సంవత్సరం అక్టోబర్‌లో అమెరికా వెళ్లి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో వైద్య రంగంలో పిహెచ్‌డి సాధించారు. ఔషధ రంగంలో అద్భుత ఆవిష్కరణలు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆయన చేసిన పరిశోధన తొలి టెట్రా సైక్లిన్ యాంటి బయోటెక్ అరియోమైసిన్ ఆవిష్కారానికి దారి తీసింది. ఫైలేరియా గురించి పరిశోధనలు నిర్వహించి హేట్రజాన్ ఔషధాన్ని కనుగొన్నారు. 1948వ సంవత్సరం ఆగస్టు 9వ తేదీన 53 ఏళ్ల వయసులో మరణించిన ఎల్లాప్రగడ సుబ్బారావు క్షయ వ్యాధి కట్టడికి ఔషధాన్ని కూడా రూపొందించారు.

--------------------------

విద్యార్థినీ విద్యార్థులలో పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిని తగ్గించి .... వారిని పరీక్షలకు సంసిద్ధులుగా తీర్చి దిద్దే ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి భారత దేశం నుండే కాకుండా విదేశాల నుండి కూడా విద్యార్థినీ విద్యార్థులు ..., తల్లిదండ్రులు ..., ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 2 కోట్ల 79 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. పేర్లు నమోదు చేసుకోవడానికి

ఈ నెల 14వ తేదీతో గడువు ముగుస్తోంది. mygov.in అన్న వెబ్ సైట్‌లో అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. పరీక్షా పే చర్చా కార్యక్రమం విద్యార్థుల మానసిక అభ్యున్నతికి బాటలు పరచి ...పరీక్షలలో వారికి సానుకూల దృక్పథం పెంపొందిస్తోంది.

---------------------------

వైకుంఠ ద్వాదశికి సంబంధించిన టోకెన్ల జారీ ప్రక్రియ తిరుపతిలో ఈరోజు కొనసాగుతోంది. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం వైకుంఠ ద్వాదశి టోకెన్ల జారీ చేస్తోంది. టిక్కెట్ల జారీ కేంద్రాల వద్ద భక్తుల సౌకర్యార్థం మజ్జిగ, మంచినీరు, అల్పాహారం వంటి ప్రత్యేక ఏర్పాట్లను టిటిడి అధికారులు చేస్తున్నారు.

======================